హైదరాబాద్ వార్త



శీతాకాలం విడిది కోసం నగరానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో స్వాగతం పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క

# నేరాల నియంత్రణలో 'సరిహద్దులు' చూడొద్దు

**-పరిధి పేరుతో కాలయాపన చేస్తే నేరస్తులు తప్పించుకునే అవకాశం**
**-ఘటనకు సమీప పోలీసులు వెంటనే స్పందించాలి**
**-సిటీ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్**
**-మూడు కమిషనరేట్ల ఉన్నతాధికారులతో సమావేశం**



సమావేశంలో పాల్గొన్న హైదరాబాద్ సిపి సజ్జనార్, రాచకొండ సిపి, సుధీర్‌బాబు, సైబరాబాద్ సిపి అవినాష్‌మహంతి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 17,ప్రభాతావర్త:** హైదరాబాద్ మహానగర పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ విషయంలో పోలీస్ స్టేషన్ల పరిధులు, కమిషనరేట్ల సరిహద్దులు అడ్డు కాకూడదని నగర సీపీ వీసీ సజ్జనర్ అన్నారు. బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు, నేరం జరిగిన వెంటనే స్పందించేందుకు జీరో డిలే విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈమేరకు బుధవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా మూడు కమిషనరేట్ల కీలక సమన్వయ సమావేశం జరిగింది. సిపి సజ్జనార్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు పాల్గొన్నారు. నగర భద్రత, ట్రాఫిక్ సమస్యలు, నేరస్థుల కదలికలపై సుదీర్ఘంగా చర్చించారు. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత తరుణంలో నేరస్తులు ఒక కమిషనరేట్ పరిధిలో నేరం చేసి, మరో కమిషనరేట్ పరిధిలోకి వెళ్తున్నారని ఉన్నతాధికారుల దృష్టికి క్షేత్రస్థాయి అధికారులు తీసుకువచ్చారు. పరిధుల పేరుతో పోలీసులు కాలయాపన చేయడం వల్ల నేరస్తులు తప్పించుకునే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో కింది స్థాయి సిబ్బంది మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూడాలని అన్నారు.నేరం ఎక్కడ జరిగినా, ఏ కమిషనరేట్ పరిధి అన్నది చూడకుండా సమీపంలోని పోలీసులు వెంటనే స్పందించాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై మూడు కమిషనరేట్ల పోలీసులు ఉమ్మడి నిఘా ఉంచాలని, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, నేరస్థులు తరచుగా తమ నివాసాలను మారుస్తున్నారని, వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా పక్కా సమాచార మార్పిడి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

**భారీ వాహనాలకు నోఎంట్రీ...**

నేరాలతో పాటు నగరంలో ట్రాఫిక్ నిర్వహణపైనా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూడు కమిషనరేట్ల పరిధిలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు. నగరంలోకి వచ్చే భారీ వాహనాల "నో ఎంట్రీ" సమయాలను ఒకేలా అమలు చేయాలని, ముఖ్యంగా పీక్ అవర్స్‌లో ఈ వాహనాలు రోడ్లపైకి రాకుండా, నగరం వెలుపలే నిలువరించాలని అన్నారు. వారాంతాల్లో మందుబాబులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తప్పించుకోకుండా, మూడు కమిషనరేట్ల పరిధిలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సరిహద్దు జంక్షన్ల వద్ద సిగ్నల్ టైమింగ్స్ విషయంలో రెండు కమిషనరేట్ల ట్రాఫిక్ పోలీసులు రియల్ టైమ్‌గా సమన్వయంతో పనిచేయాలని, దీనివల్ల వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతాయని స్పష్టం చేశారు.
నగరంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సుల వల్ల ట్రాఫిక్ సమస్యలు జటిలమవుతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమన్వయంతో అడుగులు వేయాలన్నారు..సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, నేరాల కట్టడికి మూడు కమిషనరేట్ల సమన్వయం అత్యవసరమని అన్నారు. అధునాతన సాంకేతికతను, సీసీటీవీ నెట్‌వర్క్‌ను అనుసంధానించడం ద్వారా నేరస్తుల కదలికలను రియల్ టైమ్‌లో పసిగట్టవచ్చని అన్నారు. రాచకొండ సీపీ సుధీర్ బాబు, మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు జాయింట్ టీమ్స్ ని ఏర్పాటు చేసి.. మూడు కమిషనరేట్లు సమన్వయంతో పని చేయాలన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచడంలోనూ, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలోనూ సమాచార మార్పిడి కీలకమని గుర్తు చేశారు. ఈ సమావేశంలో అదనపు సీపీ ఎం.శ్రీనివాసులు, జాయింట్ సీపీలు తఫ్సీర్ ఇక్బాల్, జోయల్ డెవిస్, గజరావు భూపాల్ తో పాటు మూడు కమిషనరేట్లకు చెందిన డీసీపీలు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో 'జనాభా...వార్డు మ్యాప్‌లు'

**-అభ్యంతరాల స్వీకరణకు రెండురోజుల గడువు -జిహెచ్ఎంసికి హైకోర్టు ఆదేశాలు**







**హైదరాబాద్, డిసెంబర్ 17,ప్రభాతవార్త:** వార్డుల పునర్విభజన ముసాయిదాపై అభ్యంతరాలు, సలహాలను స్వీకరణ గడువు బుధవారం సాయంత్రంతో ముగుస్తుండటంతో హైకోర్టు పిటిషనర్ అభ్యర్తన మేరకు మరో రెండు రోజుల గడువును పెంచినట్లు తెలిసింది. దీంతో ఈ నెల 10వ తేదీ నుంచి డీలిమిటేషన్ పై సర్కిల్, జోన్లు, ప్రధాన కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన స్పెషల్ కౌంటర్లలో ఈ నెల 19వ తేదీ సాయంత్రం అయిదు గంటల వరకు అధికారులు అభ్యంతరాలు, సలహాలను స్వీకరించనున్నారు. జనాభా సంఖ్యతో పాటు వార్డుల వారీగా మ్యాప్‌ను పబ్లిక్ డొమైన్‌ండ్ లో పెట్టాలని హైకోర్టు జీహెచ్‌ఎంసీని ఆదేశించించింది. సెన్సస్ కమిషనర్ ఇచ్చిన డిసెంబర్ 31 డెడ్ లైన్ గురించి అడ్వకేట్ జనరల్ వాదనలు విన్పించగా, డెడ్ లైన్ దగ్గర పడుతుండటంతో రెండు రోజులకు మించి ఎక్కువ పొడిగించలేమన్న హైకోర్టు స్పష్టం చేసినట్లు సమాచారం. మూడు రోజులు ఇవ్వాలని పిటిషనర్ల న్యాయవాదులు అభ్యర్థించగా, రెండు రోజులు సరిపోతుందన్న హైకోర్టు సూచించినట్లు సమాచారం. చివరి రోజుగా భావించిన బుధవారం సాయంత్రం వరకు అన్ని సర్కిళ్లు, జోన్లు, ప్రధాన కార్యాలయంలో వేల సంఖ్యలో అభ్యంతరాలు వచ్చాయి.

**వారం రోజుల్లో 5905 అభ్యంతరాలు..**

వార్డుల విభజనపై బుధవారం 1283 ఫిర్యాదులు రాగా గత వారంరోజుల్లో 5905 అభ్యంతరాలను జిహెచ్ఎంసి స్వీకరించింది. ఇప్పటి వరకు స్వీకరించిన అభ్యంతరాల్లో ఎక్కువగా వార్డులకు కొత్త పేర్లను పెట్టడటం, సరిహద్దులకు సంబంధించివి అధికంగా వచ్చినట్లు సమాచారం. అలాగే పునర్విభజించిన వార్డులు కాకుండా కొత్త వార్డులను ఏర్పాటు చేయాలని ఫిర్యాదులు అందినట్లు తెలుస్తుంది. అలాగే అభ్యంతరాల్లో కొన్ని జోన్ల పునవ్యవస్థీకరణ, సమీప జోన్లలో విలీనం వంటి అంశాలకు సంబంధించినవి ఉన్నట్లు సమాచారం. అలాగే వార్డుల పునర్విభజనకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలను డిస్పోజ్ చేసేందుకు వీలుగా జోన్ల వారీగా అయిదుగురు అధికారులతో కూడిన కమిటీలు వేశారు. ఈ కమిటీలు ఇప్పటికే పని మొదలు పెట్టగా ఇప్పటివరకు వచ్చిన మొత్తం అర్జీలను రెండు రోజుల్లో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించినట్లు సమాచారం.

# ఇతరుల గురించి ఆలోచించినప్పుడే జీవితానికి సార్థకత

**"యువ ఆపద మిత్ర" శిక్షణలో హైడ్రా కమిషనర్ రంగనాథ్**



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 17,ప్రభాతవార్త:** నేను.. నావాళ్ల తోపాటు.. చుట్టు పక్కల ఉన్న వాళ్ల గురించి ఆలోచించినప్పుడే మన జీవితానికి సార్థకత ఉంటుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. "పరుల కొరకు పాటుపడని నరుడి బతుకు దేనికని" ప్రముఖ కవి సి.నా.రె. గారు తన గజల్స్‌లో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది మానవ జీవితం పరమార్థాన్ని, ఇతరుల కోసం జీవించడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే గొప్ప వాక్యమని దీనిని అందరూ ఒంట పట్టించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తనతో పాటు చుట్టుపక్కల వారిని కూడా సురక్షితంగా కాపాడాలనే ఉద్దేశంతో యువ ఆపద మిత్ర పథకం వాలంటీర్లకు హైడ్రా ఆధ్వర్యంలో ఫతుల్‌గూడలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణను హైడ్రా కమిషనర్ ప్రారంభించి ప్రసంగించారు. పరుల కోసం పాటుపడే ఆలోచనతో ఈ శిక్షణకు రావడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. మన రెండు చేతుల్లో ఒకటి పరులకు చేయూతనందించడానికి ఉపయోగపడాలన్నారు. మనం జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడం వరకే పరిమితమవ్వకుండా ఇతరులకు కూడా చేయూతనందించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తోటివారిని కా పాడడం ఎలా అనేది ఈ శిక్షణలో నేర్పుతారని.. మీకు కూడా మీ చుట్టుపక్కల ఉన్న పరిస్థితులపై అవగాహన ఉండాలన్నారు. అప్పుడే ప్రమాద సమయంలో తోటివారిని కాపాడగలరన్నారు. వారం రోజుల శిక్షణలో అన్ని మెలుకువలు నేర్చు కుని.. వాటిని మరింతమందికి మీరు తెలియ జేయాలని సూచంచారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యకలాపాల గురించి విద్యార్థల సందేహాలను హైడ్రా కమిషనర్ నివృత్తి చేయడమే కాకుండా.. వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తెలుసుకున్నారు.
చెరువులను పునరుద్ధరించడం, ప్రజావసరాలకు ఉద్దే శించిన స్థలాలను,పార్కులను పరిరక్షించడంలో హైడ్రా కృషిని విద్యార్థులు అభినందించారు. ఈకార్యక్రమంలో హైడ్రా అడ్మిన్ ఎస్‌పి ఆర్. సుదర్శన్, అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించండి

**కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్‌తో బిసి సంఘాల భేటీ**



కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్ తో భేటీ అయిన బీసీ సంఘాల నేతలు

**హైదరాబాద్ డిసెంబర్ 17,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బీసీల ఆకాంక్షలను గౌరవించి, బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని ప్రస్తుతం జరిగే పార్లమెంటు సమావేశాలలోనే ఆమోదించాలని బీసీ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రి వీరేంద్ర కుమార్ కు విజ్ఞప్తి చేశారు. బుధవారం బిఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో పార్లమెంటులోని కేంద్రమంత్రి కార్యాలయంలో బీసీ జేఏసీ నేతలు భేటీ అయ్యారు. గత రెండు రోజులుగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆందోళన చేపట్టిన బీసీ జేఏసీ నేతలు ఈరోజు కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ ను కలిసి బీసీ డిమాండ్లపై పది నిమిషాలు చర్చించారు ఈ సందర్భంగా ఐదు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. మొదటగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వము తక్షణమే జోక్యం చేసుకొని రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని ఈ పార్లమెంటు సమావేశాలలోనే రాజ్యాంగాన్ని సవరించి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ఆయన కోరారు. టిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యధిక శాతం బీసీ జనాభా ఉన్న విద్యా ఉద్యోగ రాజకీయ రంగంలో తీరని న్యాయం జరుగుతుందని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టానికి టిఆర్ఎస్ పార్టీ కూడా మద్దతు తెలిపిందని, అసెంబ్లీలో చేసిన చట్టం 8 నెలలు గడుస్తున్నప్పటికీ ఆమోదం పొందడం లేదని అందుకే ఈ పార్లమెంటు సమావేశాలలో టిఆర్ఎస్ పార్టీ తరఫున పార్లమెంటులో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టామని తాము పెట్టిన ప్రైవేటు బిల్లుకు కూడా కేంద్ర ప్రభుత్వం మద్దతు తెలిపి బీసీ బిల్లు ఆమోదానికి కృషి చేయాలని ఆయన కేంద్ర మంత్రి కోరారు.

**బీసీ బిల్లుపై ప్రధానితో చర్చిస్తా..కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్**

బిసి జేఏసీ నేతలు చెప్పిన డిమాండ్లను ఓపికగా విన్న కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్ స్పందిస్తూ బీసీ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, ఇందిరా సహని కేసు లో సుప్రీం కోర్టు తీర్పు సామాజిక రిజర్వేషన్లు 50 శాతం పరిమితి మించొద్దని తీర్పు ఇచ్చినందున కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల నుండి బీసీ రిజర్వేషన్లు పెంచాలని వచ్చిన విజ్ఞప్తులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దేశంలో అందరికీ సమన్యాయం జరగాలని తమ ప్రభుత్వ లక్ష్యమని అందుకే వచ్చే ఏడాది నుండి దేశవ్యాప్తంగా జనగణలో కూడా కులగణ నా చేపడుతున్నామని ఆయన తెలిపారు. బీసీ రిజర్వేషన్ అంశాన్ని త్వరలోనే ప్రధాని నరేంద్ర మోడీ గారితో చర్చిస్తానని ఆయన ఈ సందర్భంగా బీసీ నేతలకు హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి కలిసిన వారిలో మాజీ పార్లమెంట్ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రం గౌడ్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పెరిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తొలగింపును ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు




ఎంజీ రోడ్డులో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు.

**బేగంపేట డిశంబరు 17,ప్రభాతవార్త** ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తొలగింపుపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి.ఉపాధి హామీ పథకం పేరును వికసిత్ భారత్.గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్ సభ లో ప్రవేశ పెట్టిన బిల్లును కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండించారు.పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు,విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తుందని వారు పేర్కొన్నారు.బుధవారం సికింద్రాబాద్ డీసీసీ ఆధ్వర్యంలో దీపక్ జాన్ నేతృత్వంలో పెద్ద ఎత్తున తరలి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని ఎంజీ రోడ్డులో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ నిరసన కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్,సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమ తదితరులు మాట్లాడుతూ ఇది గ్రామీణ పేదల సంక్షేమాన్ని దెబ్బతీసే తిరోగమన చర్యగా అభివర్ణించారు.ఇది కేవలం పథకం పేరు మార్పు కాదని,తాత్విక పునాదులపై చేసిన దాడి అని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్, శ్రీకాంత్, నసీరుద్దీన్ (అడ్డూ),పెద్ద ఎత్తున మహిళా నాయకులు,పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రద్దీ లేని సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం

**-పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ**



**కూకట్‌పల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తున్నామని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామారం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, అధికారులతో కలిసి ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజుల రామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగినదని అన్నారు. రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సి న చర్యలపై చర్చించి, ప్రణాళికను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. యుద్ధప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదనీ అధికారులను ఆదేశించారు. ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తి వరకు ఎల్లమ్మ బండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చర్యలను వెంటనే చేపట్టవివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

## ట్యాంక్‌బండ్‌పై రోడ్డు ప్రమాదం

**యువకుడు మృతి, మరొక యువకుడికి తీవ్రగాయాలు**

**ముషీరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** ట్యాంక్‌బండ్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ మహ్మద్ అంజాద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి గుడిమల్కాపూర్‌కు చెందిన రంజిత్ (19), కార్తీక్ (18) అనే ఇద్దరు స్నేహితులు ద్విచక్రవాహనంపై ట్యాంక్‌బండ్ మీదగా రాణిగంజ్ వైపు ప్రయాణిస్తున్నారు. మఖ్దూమ్ మోహియుద్దీన్ విగ్రహం వద్ద అటుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వేరే వాహనం రావటంతో వీరు ప్రయాణిస్తున్న బైక్ ఎడమవైపుకు తిప్పటంతో లారీ ముందు కుడివైపు టైరు బైక్‌ను ఢీకొట్టింది. ద్విచక్రవాహనం కిందపడిపోవటంతో బైకు పై ఉన్న రంజిత్, కార్తీక్‌లు ఇద్దరూ కింద పడిపోయారు. బైకు వెనుక కూర్చున్న కార్తీక్ తలకు తీవ్రగాయాలవటంతో అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ నడుపుతున్న రంజిత్ గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని, గాయపడిన వ్యక్తిని గాంధీఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ లీక్‌మియా(58) గా గుర్తించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

**శేరిలింగంపల్లి,డిసెంబర్ 17 ప్రభాతవార్త** అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధజలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్ లోని రాజేందర్‌రెడ్డి కాలనీలో నివాసముంటున్న శంకర్ స్థానికంగా వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికిప్రశాంత్ (9) అనే కుమారుడు ఉన్నాడు. ప్రశాంత్ స్థానికంగా ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో లో 4వ తరగతి చదువుతున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం 5:30 గంటల సమయంలో ప్రశాంత్ తన ఇంట్లోని బాత్‌రూంలో స్కూల్ ఐడీ కార్కు ట్యాగ్‌తో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న చందానగర్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రశాంత్ మృతికి కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## ఫొటోలు, వీడియోలు పంపి వైద్యురాలికి వేధింపులు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 17, ప్రభాతవార్తః** ఫొటోలు, వీడియోలు పంపి ఒక వైద్యురాలిని లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్న మాజీ ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లో నివసించే ఓ వైద్యురాలు(41) తనకున్న వైద్య కేంద్రంలో నామాల వెంకటేష్ వంశీ(34)ను 2021లో ఉద్యోగిగా నియమించారు. ఆ సమయంలో అతను వైద్యురాలి ఫొటోలు, వీడియోలు తీశాడు. అనంతరం వైద్యురాలిని లైంగికంగా వేధించడంతో అతనితో రాజీపడిన అనంతరం అతన్ని విధుల నుంచి తొలగించింది. రెండు సంవత్సరాలపాటు నిశబ్ధంగా ఉన్న వెంకటేష్ వంశీ 2024లో మళ్లీ వేర్వేరు నంబర్ల నుంచి పదేపదే ఫోన్‌కాల్స్ చేయడం, వాట్సాప్ సందేశాలను పంపడం, వైద్యురాలిని వెంబడించడం ప్రారంభించాడు. వాట్సాప్ సందేశాలు పంపి ఆమెను దూషించడం, వెంబడించడం, వేధించడం ప్రారంభించాడు. అక్టోంబరులో వైద్యురాలు నివసించే అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించడమే కాకుండా ఆమె కారును ధ్వంసం చేశాడు. ఆమెను అప్రతిష్టపాలు చేయడానికి, వృతిలో ఇబ్బం దులకు గురిచేయడానికి పాక్షికంగా ఉన్న ఫొటోలను, వీడియోలను ఆమెకు, ఆమె రోగులకు, పరిచయస్తులకు పంపాడు. అతన్ని బ్లాక్ చేసినప్పటికి అతని నుంచి వేధింపులు ఆగలేదు. దీంతో వెంకటేష్ వంశీపై చర్యలు తీసుకోవాలంటూ వైద్యురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఆత్మహత్య

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** ఉద్యోగం రాలేదని మనస్తాపానికి లోనై ఓ యువకుడు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిక్నూర్ గ్రామం, కామారెడ్డి జిల్లాకు చెందిన సాయి చరణ్ రెడ్డి (30) ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి, జీడిమెట్ల గోదావరి హోమ్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఉద్యోగ ప్రయత్నం చేసినా కొలువు రాలేదు. దీంతో మనస్తాపానికి గురై తాను ఉండే ప్లాట్‌లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బడంగ్‌పేట్ పాత కార్పొరేషన్‌లో 8 డివిజన్లు ఏర్పాటు చేయాలి

### ప్రభుత్వానికి కాంగ్రెస్ సీనియర్ దళిత నేతల వినతి



బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో వినతి పత్రాలు సమర్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ దళిత నేతలు పుట్టగళ్ళ జగన్, గుడ్ల శ్రీనివాస్

**సరూర్‌నగర్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల విలీనం అయిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 8 డివిజన్లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ దళిత నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం బడంగ్‌పేట్‌కు చెందిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, నాదర్‌గుల్‌కు చెందిన సీనియర్ నాయకుడు పుట్టగళ్ల జగన్‌తో పాటు పుట్టగళ్ళ భాస్కర్‌లు బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన పదేళ్ళ కాలంలో శరవేగంగా అభివృద్ధి చెందిన బడంగ్‌పేట్ పేరిట బడంగ్‌పేట్‌లోనే జిహెచ్ఎంసి జోన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. 15 వేల నుండి 20 వేల ఓట్లతో మొత్తం 8 డివిజన్లు ఏర్పాటు చేయాలని వారన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే డివిజన్లకు పాత గ్రామాల పేర్లనే పెట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. దీని వల్ల సదరు గ్రామాల పేర్లు కనుమరుగు కాకుండా ఉంటాయని వారు వెల్లడించారు. తమ విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని గుడ్ల శ్రీనివాస్, పుట్టగళ్ళ జగన్‌లు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



**నేరేడ్ మెట్, డిసెంబర్ 17,ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నేరేడ్మెట్ డివిజన్‌కు చెందిన జానకి దేవికి నాలుగు లక్షల రూపాయలు, వినాయక్ నగర్ డివిజన్‌కు చెందిన శరణ్యకు నలభై వేల రూపాయల సహాయ నిధి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, రావుల అంజయ్య, తులసి సురేష్, ఫరీద్, కరీం, చందు, ఎం.ఆర్. శీను, సంపత్ యాదవ్, పేపర్ శీను, అరుణ్ సాయి, శివ గౌడ్, జేకే సాయి గౌడ్, పరమేష్, నవీన్ రాజ్, నరేష్ గౌడ్, అవినాష్, గంగాధర్ పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలి

### - కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి



రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

**మలక్ పేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని ముసారాం బాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ లోని ఎస్బిఐ కాలనీ లో రూ.16 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను స్థానిక కాలనీ వాసులు, జిహెచ్ఎంసి సిబ్బందితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపు నీరు నిలవకుండా సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని, తవ్విన రోడ్లు అన్నింటి నీ వారాం రోజులలోపు పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోఏఇ శరత్ రెడ్డి , వర్క్ ఇన్స్పెక్టర్ సత్తిరెడ్డి , సూపర్వైజర్ హరీష్, కాలనీవాసులురాములు, కృష్ణ రావు,పూర్ణ చందర్ రావు,సురేందర్, యాదగిరి, సంతోష్, చందు,ప్రసన్న,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

### - అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ రెడ్డి, సెక్రటరీ జనరల్ చోలా ఓం ప్రకాష్ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత రెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట సలీంనగర్ లోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి బిఎస్ నకరా ని స్మరించుకుంటూ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ డిఎ లను వెంటనే ప్రకటించాలని, ఎటువంటి సీలింగ్ లేకుండా అన్ని కార్పొరేట్ ఆస్పత్రిలో నగదు రహిత చికిత్స అందించాలని, రెండో పిఆర్సి ను వెంటనే అమలు చేయాలని కోరారు. పదవి విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ ఆర్థిక ప్రయోజనాలు 2024 నుంచి రాకపోవడంతో ఆవేదన చెందుతున్న విషయాన్ని గమనించి వెంటనే పదవి విరమణ పొందిన తర్వాత లభించే ఆర్థిక ప్రయోజనాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు కే. మదన్మోహన్, గౌరవాధ్యక్షుడు కృష్ణమూర్తి, పున్ రెడ్డి కృష్ణారెడ్డి, వరూధిని, నాగమణి, వీరయ్య, షఫియా బేగం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల వారీగా ప్రథమ పౌరులు వీరే



మజీద్‌పూర్ (మేడిపల్లి (ప్రియా, ఓపిఆర్)



కవాడిపల్లి (కొలన్ లక్ష్మీ ప్రసన్న, కాంగ్రెస్



పిగ్లీపూర్ (కోటా ప్రభాకర్ రెడ్డి, ఏకగ్రీవం, కాంగ్రెస్



బండరావిరాల కందికంటి విజయ్ కుమార్, బీఆర్ఎస్



చిన్న రావిరాల
పబ్బతి బాల కిషన్ గౌడ్, కాంగ్రెస్



బాటసింగారం ఎర్రవెల్లి
గౌరీ శంకర్ చారి, బీఆర్ఎస్



గండి చెరువు
జక్క రవీందర్ రెడ్డి, కాంగ్రెస్



బలిజగూడ ఉప్పు మాధవి
బీజేపీ



లష్కర్ గూడ
అల్లి ఐలయ్య యాదవ్,కాంగ్రెస్



జాఫర్ గూడ
ఎర్ర వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్



అబ్దుల్లాపూర్ మెట్
మందుగుల విజయ, కాంగ్రెస్



ఇనాంగుడా రాఘవేందర్
బిఆర్ఎస్



గుంతపల్లి
అంతటి హేమలత, కాంగ్రెస్ రెబల్



అనాజ్ పూర్
రాచపాక నవనీత, బీఆర్ఎస్

**అబ్దుల్లాపూర్మెట్, 17 డిసెంబర్, ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్ మండలంలో జరిగిన మూడో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో గోదావరి పోటీ నెలకొంది. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ఒక గ్రా మం ఏకగ్రీవం కాగా 13 గ్రామ పంచాయతీలకు బుధవారం ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్య ర్థులు ఆరు స్థానాలలో, బి ఆర్ ఎస్ బలపరిచిన అభ్యర్థులు నాలుగు స్థానాలలో, బిజెపి ఒక స్థానంలో, ఓ పి డి ఆర్ ఒక స్థానంలో, కాంగ్రెస్ రెబల్ ఒక స్థానంలో విజయం సాధించారు.

## జిల్లెలగూడ శ్రీవారి హుండీ ఆదాయం రూ.2,63,630



దేవాదాయ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్, ఆలయ ఇఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డిల సమక్షంలో హుండీ లెక్కింపు చేస్తున్న పూజారులు, శ్రీవారి సేవకులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని పురాతన దేవాలయాల్లో ఉత్తర ద్వారం ఉన్న అరుదైన దేవాలయంగా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ సమీపంలోని జిల్లెలగూడ గ్రామంలోనున్న మత్స్యావతార శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం నాలుగు నెలలకు సంబంధించి రూ.2,63,630 వచ్చింది. బుధవారం ఉదయం దేవాదాయ ధర్మాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా తూర్పు విభాగం డివిజన్ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ ఇఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, పోరెడ్డి జంగారెడ్డి, చింతపట్ల జ్ఞానేశ్వర్ తదితరుల సమక్షంలో హుండీలను తెరిచారు. అనంతరం ఇఓ కార్యాలయ ఆవరణలో హుండీ మొత్తాలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, సిబ్బంది, పలువురు శ్రీవారి సేవకులు లెక్కింపు జరిపారు. ఈ నేపథ్యంలో గడచిన నాలుగు నెలల పది రోజులకు సంబంధించిన హుండీ ఆదాయం రూ.2,63,630 వచ్చింది. ఈ మేరకు అధికారుల సూచన, ఆలయ వ్యవస్థాపక ఫ్యామిలీ మెంబర్/చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్ ఆదేశాలతో హుండీ ఆదాయానికి ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు ఇఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌గౌడ్, ప్రధాన అర్చకుడు డింగరి రామాచార్యులు, సీనియర్ అర్చకుడు రాఘవాచార్యులు, సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఆరు డివిజన్లుగా విభజించాలి : పట్నం రమేష్ కురుమ



**తుర్కయంజాల్ డిసెంబర్17,ప్రభాతవార్త :** తుర్కయంజాల్‌ను ఆరు డివజన్‌లుగా విభజించాలని పట్నం రమేష్ కురుమ పేర్కొన్నారు. బుధవరం సర్కిల్ కార్యాలయంలో అధికారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ మాట్లాడుతూ అత్యధిక జనాభా ఉన్న తుర్కయంజాల్ మున్సిపాలిటీని కేవలం రెండు డివిజన్లుగా విభజించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము 24 వార్డులు ఉన్నటువంటి తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఐదేళ్ల క్రితం ఉన్న జనాభా కంటే ఇప్పుడు రెట్టింపు అయ్యింది భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది ప్రక్కనే ఉన్న ఆదిభట్ల మున్సిపాలిటీని 15000 జనాభా కు ఒక డివిజన్ చొప్పున ఏర్పాటు చేశారు. అదే ప్రాతిపదికన తుర్కయాంజాల్ మున్సిపాలిటీ లో ఆరు డివిజన్లు ఏర్పాటు కావడానికి అవకాశం ఉంది అధికారులు తక్షణమే స్పందించి పాలనా సౌలభ్యం కొరకు ఆరు డివిజన్లు గా విభజించి ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని బహుజన సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీకమిటీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లపంగి రాజు, కోశాధికారి చెక్క రంజిత్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ ఏర్పుల రవి కుమార్, కోహెడ సెక్టార్ అధ్యక్షులు శీలం అంగద్ కుమార్, మాజీ కార్యదర్శి జంతుక సైదులు పాల్గొన్నారు

## ఎంఐఎంకి లబ్ధి చేకూర్చేలా డివిజన్ల డీలిమిటేషన్

### -సర్కిల్ కార్యాలయం ఎదుట బిజెపి ధర్నా
### - ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**అత్తాపూర్ డిసెంబర్ 17,ప్రభాతవార్త :** మైనార్టీ ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం హిందూ డివిజన్ల విచ్ఛిన్నం చేశారని ప్రభుత్వం జిహెచ్ఎంసిలో చేపట్టిన డిలిమిటేషన్ అశాస్త్రీయంగా ఉందని పలువురు బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం డివిజన్ల పునర్విభజనను వ్యతిరేకిస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైలార్ దేవ్ పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి,గోల్కొండ గోషామహల్ ఇన్‌చార్జ్ వై. శ్రీధర్ , చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ వి. మల్లారెడ్డి హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నేతలు మాట్లాడుతూ...రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన అత్యంత అస్తవ్యస్తంగా, రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందని మండిపడ్డారు. హిందువులు అధికంగా నివసించే ప్రాంతాలను కావాలని మైనార్టీ ప్రాంతాలతో కలిపి, ఎంఐఎం పార్టీకి రాజకీయంగా లబ్ధి చేకూర్చేలా డివిజన్ల మ్యాపింగ్ చేశారన్నారు, కేవలం ఎంఐఎం అభ్యర్థులు జిహెచ్ఎంసి ఎన్నికల్లో సులభంగా గెలిచేలా తెరవెనుక చీకటి ఒప్పందాలు చేసుకుని ఈ విభజన ప్రక్రియను చేపట్టారని, నిబంధనలకు విరుద్ధంగా, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా మైనార్టీ డివిజన్లను పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ అశాస్త్రీయ విభజనను నిలిపివేసి, నిష్పక్షపాతంగా డివిజన్ల ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని బిజెపి నాయకులు హెచ్చరించారు. నిరసనలో జిల్లా కార్యదర్శి కొమురయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్, సాబాద విజయకుమార్, అడికే జనార్దన్,వనిత దామోదర్ రెడ్డి, సరిత రెడ్డి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ముంద్ర సంగీత, అంబిక, సొల్కర్ రెడ్డి, రాజు పహిల్వాన్,డివిజన్ల అధ్యక్షులు గోదా పాండు యాదవ్, సూర్ రెడ్డి, వినయ్ రెడ్డి, సులిగే వెంకటేష్, రామారావు, శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్, వెంకట్ రెడ్డి, రావుల జగన్, రాజశేకర్ రెడ్డి, నిఖిల్,మన్మోహన్ రెడ్డి, వెంకటరమణ, రాంబాబు,గడ్డం నవీన్ మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిసిపికి వైకుంఠ ఏకాదశి ఆహ్వాన పత్రిక అందజేత



దక్షిణ మండలం డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్‌కు వైకుంఠ ఏకాదశి మహోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చౌక్ మైదాన్ శ్రీ బాలాజీ మందిరం ప్రధాన అర్చకులు శృంగారం రమణా చార్యులు

**చార్మినార్,డిసెంబరు 17 ప్రభాతవార్త :** చార్మినార్ సమీపంలోని శ్రీ బాలాజీ మందిరంలో ఈ నెల 30వ తేదీన జరగనున్న శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ దక్షిణ మండలం డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్‌కు మందిరం ప్రధాన అర్చకులు శృంగారం రమణా చార్యులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధి ప్యారసాని వెంకటేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## 111.జీవో ఉన్న గ్రామాలను ప్రత్యేక మున్సిపాలిటీగా చేయాలి

### - నార్సింగి సహకార సంఘం చైర్మన్ కృష్ణ



నార్సింగి సరినకల్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సహకార సంఘం చైర్మన్ టి.కృష్ణ.

**నార్సింగి, డిసెంబర్ 17 ప్రభాతవార్త :** హైదరాబాద్ మహా నగరం శివారుల్లో 111.జీవో పరిధిలో ఉన్న గ్రామాల సముదాయాన్ని కలిపి ప్రత్యేక మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని నార్సింగి సహకార సంఘం చైర్మన్ టి.కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు నార్సింగి సర్కిల్ అధికారులకు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 111.జీవో పరిధిలోని గ్రామాలను ఏకపక్షంగా గ్రేటర్‌లో కలుపుకోవడం కోర్టు తీర్పుకు విరుద్ధం కాదా? అని ప్రశ్నించారు. ఖానాపూర్ గ్రామం మొత్తంను ఒకే డివిజన్ పరిధిలోకి తీసుకు రావాలని, రెండు డివిజన్ల పరిదుల్లోకి మార్చడంను మేము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఖానాపూర్ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఎంత వరకు ఇస్తారో స్పష్టంగా వివరించాలన్నారు. గండిపేట చెరువుకు ఖానాపూర్ గ్రామం ఆనుకొని ఉండడం వలన 111.జీవో కిందకు వస్తుందని, దీంతో కరెంటు మీటర్లు కూడా ఇవ్వడం లేదన్నారు. గ్రేటర్‌లో కలిపిన తరువాతా ఎలాంటి శరతులు లేకుండా కరెంటు మీటర్లు, ఇళ్ల పర్మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖానాపూర్, వట్టినాగులపల్లి, జన్వాడ, మీర్జాగూడ, మియాఖాన్‌గడ్డ ప్రాంతాలను కలిపి ఓ ప్రత్యేక మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని నార్సింగి సహకార సంఘం చైర్మన్ కృష్ణ డిమాండ్ చేశారు.

## యువతరం బిఆర్ఎస్‌లోకి రావాలి : నవతారెడ్డి



బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులకు గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొబ్బ నవతారెడ్డి, పార్టీ నేతలు

**శేరిలింగంపల్లి,,డిసెంబర్ 17 ప్రభాతవార్త** యువతరం బీఆర్ఎస్ పార్టీలోనికి రావాలని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నేత, చందానగర్‌మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని కొండాపూర్ డివిజన్‌లో అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ బీజేవైఎం వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ ఆయన అనుచరులతో పాటు సుమారు 50మందికి పైగా బీఆర్ఎస్ లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన యువకులకు మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి గులాబీ కండువాలను కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నవతారెడ్డి మాట్లాడుతూ..ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీలోనికి యువత చేరేందుకు ముందుకు వస్తుందని అన్నారు. రాబోయే కాలంలో శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఆమె ఆశాభావం వ్యక్తం చేవారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, సంగారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిసి నిర్మాణ పనులు ప్రారంభం



**చాంద్రాయణగుట్ట డిసెంబర్ 17 ప్రభాతవార్త :** గౌలిపురా డివిజన్ ఎన్ఆర్‌టి కాలనీలో రూ.5.60లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ భాగ్యలక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజి, మంచినీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్య పనులకు అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కల్‌దేవ్, జ్ఞానేశ్వర్, సత్యనారాయణ, దిలీప్, సాయి కుమార్, వేణుగోపాల్, అనిల్, రవి,సుమన్ పాల్గొన్నారు.

## ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్ఇ శ్రీనివాస్



ఆస్మాన్ ఘడ్ విద్యుత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు నిర్వహిస్తున్న ఎస్ఇ శ్రీనివాస్, డిఇలు విష్ణువర్ధన్ రెడ్డి, సురేష్ ,బిషప్ తిమోతి తదితరులు

**మలక్ పేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:** ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఇ శ్రీనివాస్ ,ఆస్మాన్ ఘడ్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆస్మాన్ ఘడ్ విద్యుత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా ఎస్ఇ శ్రీనివాస్, డిఇ లు విష్ణువర్ధన్ రెడ్డి, సురేష్ ,శ్రీధర్ తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ అందరి జీవితాలలో వెలుగులు ప్రసాదించాలని పేర్కొన్నారు. ముఖ్య ప్రసంగికులుగా విచ్చేసిన రాక్ చర్చి పాస్టర్ బిషప్ తిమోతి మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని, ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు నిర్వహించి భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏఓ చంద్రుడు, ఏడిఇలు శోభన్ బాబు, వినోద్ రెడ్డి, సత్యనారాయణ, ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ బాబు, నిర్వాహకులు జయపుత్ర, ప్రేమ్ విజయ్, తైసిన్, రామకృష్ణానంద్, రామకృష్ణ, గాబ్రియల్, రాము, విజయ్, దాస్, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసిన మాజీ మేయర్ అజయ్ యాదవ్



హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ను కలిసిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బొమ్మక్ కళ్యాణ్ కుమార్ , సుమన్ నాయక్

**బోడుప్పల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త;** కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ని మాజీ మేయర్ తోటకుర అజయ్ యాదవ్ , మాజీ కార్పొరేటర్లు భూక్య సుమన్ , బొమ్మక్ కళ్యాణ్ మర్యాదపూర్వకంగా కలిసి బోడుప్పల్ ప్రధాన రోడ్లు, పార్క్ లు, చెరువులు, పలు అభివృద్ధికి దాదాపు రూ. 50 కోట్ల నిధులతో పనులు ప్రారంభించినందునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి మిగులురా చెరువు అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

## కృపా కాంప్లెక్స్‌లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగింపు



**నేరేడ్ మెట్, డిసెంబర్ 17,ప్రభాతవార్త :** ఫుట్ పాతులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే సహించేది లేదని టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సంగీత పేర్కొన్నారు గత 30 సంవత్సరాలుగా ఫుట్ పాత్‌లను ఆక్రమించి ఇతరులకు అద్దెకిచ్చి కిరాయి వసూలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోని, ఫుట్ పాత్ ఆక్రమించి వ్యాపారం చేస్తున్న టిఫిన్ సెంటర్, పాన్ షాప్లను తొలగించి పాదాచార్లకు వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని స్థానిక నాయకులు స్పైడర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కృపా కాంప్లెక్స్ కాలనీవాసులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు సంగీత ఆధ్వర్యంలో, ట్రాఫిక్ పోలీసులు జిహెచ్ఎంసి సిబ్బంది సహకారంతో ఫుట్ ఫాత్ అక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి సంగీతం మాట్లాడుతూ ఫుట్ పాతులపై అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తే సహించేది లేదని, మరి ఫుట్పాతులను అద్దెకిచ్చి డబ్బులు వసూలు చేయడం మరింత దారుణమని వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది కుమార్, విజయ్,ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా డీలిమిటేషన్ చేయాలి

### -కమిషనర్ ఆర్.వి కర్ణన్‌ను కలిసిన కార్పొరేటర్ అర్చన జయప్రకాష్



**అత్తాపూర్ డిసెంబర్ 17,ప్రభాతవార్త :** ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా డిలిమిటేషన్ చేపట్టాలని సులేమాన్ నగర్ డివిజన్‌లో శివరాంపల్లి,ఉప్పర్‌పల్లి హైదర్‌గూడ డివిజన్‌లలో కల్పోవద్దని రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం జిహెచ్ఎంసి కార్యాలయంలో కమిషనర్ ఆర్.వి కర్ణన్‌ను రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ....వార్డుల పునర్విభజన ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ప్రజాభిప్రాయాలు తర్వాత చేపట్టాలన్నారు. ప్రభుత్వం జిహెచ్ఎంసిలో చేపట్టిన డిలిమిటేషన్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డిలిమిటేషన్‌లో భాగంగా శివరాంపల్లి గ్రామాన్ని సులేమాన్ నగర్ డివిజన్‌లో కలపడం జరిగిందని ఉప్పర్‌పల్లి పాత కోర్టు ప్రాంతాన్ని హైదర్‌గూడ డివిజన్‌లో వీలనం చేశారని దీంతో స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని స్థానిక ప్రజాప్రతినిధులు,ప్రజల అభిప్రాయాలు లేకుండా ఎలా విలీన ప్రక్రియ చేపడతారన్నారు. అలా చేయడంతో రాజకీయంగా తీవ్ర సమస్యలు ఏర్పడుతాయని శివరాంపల్లి ,ఉప్పర్‌పల్లిలను రాజేంద్రనగర్ డివిజన్‌లోనే కొనసాగించాలని కమిషనర్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.